సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 11 । జనవరి । 2023



సామగ్రి కొనుగోలకు అంగీకారం

విజయనగరం అర్బన్: గ్రంథాలయాలకు అవసరమైన కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, జెరాక్స్ మిషన్ కొనుగోలుకు సభ్యులు అనుమతించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి అధ్యక్షతన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. సంస్థ కార్యదర్శి లలిత పాల్గొన్నారు.



బాధ్యతగా 'శంబరం' నిర్వహిద్దాం

విజయనగరం అంటే గుర్తుకువచ్చేది పైడితల్లి అమ్మవారి పండగ. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా అంటే శంబరపోలమాంబ అమ్మవారిజాతర ఘనంగా నిర్వహించుకుందామని ఆర్డీవో హేమలత కోరారు.

-IIలో

డీఆర్సీ సమావేశం వాయిదా

విజయనగరం అర్బన్: జిల్లా సమీక్ష మండలి సమావేశం (డీఆర్సీ) వాయిదా పడినట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. జగనన్న తోడు పథకం నాలుగో విడత జగనన్న తోడు కార్యక్రమం ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న దృష్ట్యా అదే రోజున జరగాల్సిన డీఆర్సీ సమావేశం వాయిదా వేసినట్టు వెల్లడించారు. తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు.

న్యూస్‌రీల్

పెదపోలమ్మా.. కరుణించమ్మా...



పక్కి గ్రామంలో పెదపోలమ్మ సిరిమానోత్సవం

బొబ్బిలి రూరల్: మంగళవాయిద్యాలు.. మహిళల కోలాట ప్రదర్శనలు.. బళ్ల వేషధారణలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ బొబ్బిలి మండలంలోని పక్కి గ్రామంలో పెదపోలమ్మ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. సిరిమానును అధిరోహించిన పూజారి నక్కా పకీరు భక్తులకు అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. వీధివీధికి వచ్చిన సిరిమానును చూసి భక్తులు పులకించిపోయారు. పెదపోలమ్మా.. కరుణించమ్మా అంటూ ప్రార్థించారు. సిరిమానుతో పాటు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆయన సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు తిరిగారు. సిరిమానోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కుబడులు చెల్లించారు. సీఐ ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిరిమానోత్సవంలో డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం, గజపతినగరం ఎమ్మెల్యేలు కంబాల జోగులు, బొత్స అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ కాల్ సెంటర్ ఏర్పాటు

- టోల్ ఫ్రీ నంబరు 1967

పార్వతీపురం: పౌర సరఫరాల శాఖకు సంబంధించి విజయవాడలో సమీకృత కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాల్ సెంటర్‌లో 10 మంది కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు ఉంటారని ఆయన పేర్కొన్నారు. కాల్ సెంటర్ మంగళవారం నుంచే పనిచేస్తుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), ధాన్యం కొనుగోలు, తూనికలు–కొలతలు, వినియోగదారుల రక్షణ తదితర పౌర సరఫరాల సంబంధ సమస్యలపై కాల్‌సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన సమీకృత కాల్‌సెంటర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

జాబ్ మేళా రేపు

విజయనగరం రూరల్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్ డీసీ), సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 12న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఏపీఎస్ఎస్ డీసీ జిల్లా అధికారి నీలం గోవిందరావు మంగళవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు జాబ్ మేళాకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18–27 ఏళ్ల వయస్సు లోపు యువతీయువకులు హాజరుకావాలన్నారు. బహుళజాతి కంపెనీలు డెక్కన్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్, జయభేరి ఆటోమొబైల్స్ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి వివరాలను ఏపీఎస్ఎస్ డీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం, టీటీడీసీ మహిళా ప్రాంగణంలో నిర్వహించే జాబ్ మేళాకు రిఫరెన్స్ నంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్: 85558 32416, 90520 57825, 99888 53335 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంక్రాంతి తర్వాత గృహ ప్రవేశాలు

భోగాపురం: పోలిపల్లి రెవెన్యూ పరిధిలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్వాసితులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న నిర్వాసితులు సంక్రాంతి పండగ తర్వాత మంచి ముహూర్తం ప్రకారం గృహప్రవేశాలు చేసి గ్రామాలను ఖాళీ చేయాలని ఆర్డీఓ ఎంవీ సూర్యకళ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో విమానాశ్రయ నిర్వాసితులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలను ఖాళీ చేయడానికి అభ్యంతరాలు లేవన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని వారు ఉన్నారని, వారికి కూడా స్థలాలు మంజూరు చేస్తే గ్రామాలను ఖాళీ చేయడానికి వీలవుతుందని నిర్వాసితులు వెల్లడించారు. స్థలాలు లేని వారికి ఆర్ అండ్ఆర్ చట్ట ప్రకారం స్థలాలు కేటాయించలేమని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రేషన్‌కార్డు ఉన్న వారు జగనన్న ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ బంగారునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌కుమార్, నిర్వాసితులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి.. సర్కారు సాయం



సూక్ష్మసేద్య పరికరాలతో బంతిసాగు

- 50 నుంచి 90 శాతం సబ్సిడీపై పరికరాలు
- సన్న, చిన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యం
- జిల్లాలో సాగు లక్ష్యం 17 వందల హెక్టార్లు
- ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన సాగు విస్తీర్ణం 1674 హెక్టార్లు
- పరికరాల అందజేతకు కేటాయించిన నిధులు రూ.11.35 కోట్లు
- తక్కువ పెట్టుబడి, నీటితో అధిక దిగుబడుల సాధనే లక్ష్యం

పాలకొండ రూరల్: తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగుచేయడం, అధిక దిగుబడులు సాధించేందుకు అనువైన సూక్ష్మసేద్యాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీపై పరికరాలు సమకూర్చుతోంది. తక్కువ పెట్టుబడితో సాగును లాభదాయకంగా మార్చుకునేందుకు అనువైన వసతులు కల్పిస్తోంది. చిన్న,సన్నకారు రైతులకు డ్రిప్ పరికరాలను 50 నుంచి 90 శాతం రాయితీతో రైతులకు అందజేస్తోంది. ఎకరా నుంచి 5 ఎకరాలలోపు భూమిగల రైతులకు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల భూమిగల రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ యంత్రాలు అందిస్తోంది. అలాగే, ఎకరా నుంచి 5 ఎకరాల వరకు భూమిగల రైతులకు 55 శాతం, 5 నుంచి 12.50 భూమి గల రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్ల యంత్రాలను సమకూర్చుతోంది. సాగునీటి వసతిలేని భూముల్లో అధిక దిగుబడి సాధించేలా జిల్లా సూక్ష్మసేద్య అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మన్యంలో సాగు లక్ష్యం..

పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 1700 హెక్టార్లలో బిందు సేద్యం చేపట్టేలా అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ క్రమంలో 1305 మంది రైతులు దాదాపు 1674 హెక్టార్లలో బిందు సేద్యానికి ఉపక్రమిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. 225 మంది రైతులకు సంబంధించి 288.07 హెక్టార్లకు యంత్రాలు అందించేందుకు కలెక్టర్ ద్వారా అనుమతులు పొందారు. ఈ రైతులకు సంబంధించి రూ.1.75 కోట్ల విలువగల పరికాలు అందిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అనువైన పంటలు.. ప్రయోజనాలు...

పామాయిల్, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మిరప, చెరకు, వేరుశనగ, మినుము పంటల సాగులో బిందు, స్ప్రింక్లర్ల వినియోగం సులభం. సాగునీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి అధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. కలుపు బెడద ఉండదు. మొక్క పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది. పంట దిగుబడి పెరుగుతుంది.



పామాయిల్ తోటలో బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయితీ మొత్తం ఇలా..

- ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వర్తిస్తుంది. ఐదు నుంచి 12.50 ఎకరాల భూమి గల రైతులు 50శాతం రాయితీతో బిందు పరికరాలు తీసుకోవచ్చు. ఒక్కో రైతు గరిష్టంగా రూ.3.10 లక్షల వరకు రాయితీ పొందవచ్చు.
- తుంపర సేద్యంలో సన్న, చిన్నకారు రైతులు స్ప్రింక్లర్ పరికరాలను 55 శాతం రాయితీపై పొందవచ్చు. ఐదు నుంచి 12.50 ఎకరాల రైతులకు 45 శాతం రాయితీపై పరికరాలు తీసుకోవచ్చు. రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు ఏడేళ్ల తర్వాత రెండో పర్యాయం సబ్సిడీపై పరికరాలు పొందే వెసులబాటు ఉంది.

దరఖాస్తు చేయండిలా..

- డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రాయితీపై పొందేందుకు రైతులు తమ ఆధార్ కార్డు, తహసీల్దార్ ద్వారా ధ్రువీకరించబడిన భూమి యాజమాన్య పత్రం, 1–బీ రికార్డుతో రైతు భరోసా (ఆర్బీకే) కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలోనే పరికరాలు పొందదలచిన కంపెనీ పేరును నమోదు చేయాలి.
- దరఖాస్తులో తప్పనిసరిగా రైతు తన సెల్ నంబర్ నమోదు చేసుకోవాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలను నేరుగా రైతు ఫోన్‌కు మెసేజ్ ద్వారా తెలియజేస్తారు.
- వెబ్‌ల్యాండ్ పోర్టల్లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా సబ్సిడీ అర్హత నిర్ణయిస్తారు.

నాలుగేళ్లుగా బిందు సేద్యం



దాదాపు నాలుగేళ్లుగా మాకున్న భూమిలో బిందుసేద్యం విధానంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. సాటునీటి ఇబ్బందులు తప్పాయి. తెగుళ్ల బెడదను అధిగమించాం. అధికారుల సలహాలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నాం. పంట వరుసల మధ్య నీటి తడులు అందించడం, పురుగుమందుల పిచికారీ సులభం.

– కె.మణిబాబు, సూక్ష్మ సేద్యం రైతు

రైతులే కంపెనీని ఎంపికచేసుకోవచ్చు



ఆర్బీకేల ద్వారా దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులే తమకు ఏ కంపెనీ సూక్ష్మసేద్య పరికరాలు కావాలో ఎంపిక చేసుకోవచ్చు. ఆ కంపెనీకి చెందిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పొలంలో అమర్చుతాం. జిల్లాలో జైన్, ఇనోలెక్స్, రుమ్‌ంతా కంపెనీలకు చెందిన సూక్ష్మసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మా సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సూక్ష్మసేద్య పరికరాలు రాయితీపై పొందేందుకు ఔత్సాహిక రైతులు సెల్: 79950 87038 నంబర్‌ను సంప్రదించవచ్చు.

– ఎల్.శ్రీనివాసరావు, జిల్లా సూక్ష్మసేద్యఅధికారి, పార్వతీపురం మన్యం

ఎరువులు సైతం డ్రిప్ ద్వారానే..



బిందు సేద్యంలో ఎరువులను సైతం డ్రిప్ పరికరాల ద్వారా అందించవచ్చు. దీంతో పంట దిగుబడి పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా అన్నిసౌకర్యాలను సంబంధిత రైతులకు కల్పిస్తోంది. పెద్ద ఎత్తున రాయితీలను ఇచ్చి ప్రోత్సహిస్తోంది. అధికారుల సహకారం ఉంటుంది. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారి, పాలకొండ

● భలే డిమాండ్.



రాజాం వెలుగు కార్యాలయం వద్ద పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మంగళవారం ఆర్గానిక్ సరుకుల విక్రయ స్టాల్‌ను ఏర్పాటుచేసింది. పలు రకాల సబ్బులు, షాంపూబాటిల్స్, ఫ్లోర్ క్లీనింగ్ ఆయిల్స్, త్రిఫల ఔషధాలు వంటివి 10 నుంచి 15 శాతం తగ్గింపు ధరకు విక్రయించింది. వీటి కొనుగోలుకు జనం ఎగబడ్డారు. వెలుగు ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం దధికుమార్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సామంతుల అరుణకుమారి తదితరులు స్టాల్‌ను సందర్శించారు. – రాజాం

ప్రతి సెంటు భూమికి సాగునీరు

- సాగునీటి కాలువ పనులు పరిశీలించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్



కెనాల్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: మక్కువ మండలంలోని శివారు ప్రాంతంలో ఉన్న ప్రతి సెంటు భూమికి సాగునీటి సౌలభ్యం కల్పించాలని అధికారులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. వెంగళరాయ సాగర్ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ ఆధునికీకరణ లైనింగ్ పనులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మక్కువ మండలం చెముడు గ్రామం వద్ద కాలువ లైనింగ్, సాలూరు మండలం లక్ష్మీపురం వద్ద హెడ్‌వర్క్స్ పనులను మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు కుడిప్రధాన కాలువ ద్వారా మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాల పరిధిలోని సుమారు 16,150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ వద్దనున్న ఆక్విడెక్ట్ ద్వారా ఎంతమేర సాగునీరు అందినది, ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. సుమారు 2.05 కిలోమీటర్ల ఆక్విడెక్టు మరమ్మతులకు గురికావడంతో ఆయకట్టుకు సాగునీరు సరిగా అందడంలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ కాలువ లైనింగ్ పనులతో పాటు నూతన ఆక్విడెక్టు నిర్మాణం చేపట్టాలని, వెంగళరాయసాగర్ రిజర్వాయర్ ప్రాజెక్టు విస్తీర్ణం, నీటి సామర్థ్యం తదితర విషయాలను మ్యాప్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం హెడ్‌స్లైస్, స్పిల్ వే, గేట్లు, సైరన్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్.అప్పలనాయుడు, డీఈ సురేష్, జేఈఈలు శ్రీనివాస్, జగదీష్, రాజశేఖర్, ప్రశాంత్, బి.తిరుపతి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కె.స్వాతి, ఏఎస్ఐ బి.వి.రమణ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- డీఈఓ ఎస్‌డీవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురంటౌన్: మారుతున్న కాలానుగుణంగా విద్యారంగంలో వస్తున్న సాంకేతికతను వ్యాయామ ఉపాధ్యాయులు కూడా అందిపుచ్చుకుని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డీవీ రమణ పిలుపునిచ్చారు. జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (ఆర్‌సీఎం పాఠశాల)లో మంగళవారం ఏర్పాటు చేసిన ఒకరోజు యాప్స్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యలో వ్యాయామ విద్యను ప్రాధాన్యత క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చేర్చిందన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా యాప్స్‌లో నమోదుచేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులందరూ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పాఠశాలల్లో క్రమశిక్షణాయుతంగా విద్యార్థులను ఆటపాటల్లో ప్రోత్సహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగ్గుల పోటీలు
- ఆకట్టుకున్న చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్
- యువతను ఉత్సాహపరిచిన బిగ్‌బాస్ ఫేమ్ సిరి

విజయనగరం టౌన్: మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం మనందరి కనీస బాధ్యతని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మైత్రీ మీడియా, జీ తెలుగు సంయుక్తంగా గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్యస్పందన లభించింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పూర్వం గాలిపటాలను ఎగురవేసుకుంటూ ఆనందంగా గడిపేవాళ్లమని, నేడు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. కరోనా కష్టకాలంలో పైడితల్లి అమ్మవారి పండగను ఎవరి ఇళ్ల వద్ద నుంచి వారే తిలకించేందుకు మైత్రీ మీడియా ఏర్పాటుచేసిన ప్రసారాలు ఎనలేనివని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతీ ప్రేక్షకునికి మైత్రీ సేవలు అందించేందుకు తామెప్పుడూ ముందుంటామని సంస్థ యాజమాన్య ప్రతినిధి అవనాపు విక్రమ్ పేర్కొన్నారు. అనంతరం రంగవల్లికల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బంగారు ఆభరణాలను బహుమతులు అందజేశారు. ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు, ట్రెజర్ హంట్ విజేతలకు విలువైన టీవీలు, గిఫ్ట్ ఓచర్లను బహుమతులుగా అందించారు. బిగ్‌బాస్ ఫేమ్ గాయని సురభి శ్రావణి, బిగ్‌బాస్ ఫేమ్ సిరి యువతను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ముధునూరు సాయినకుల్‌వర్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ఇళ్లనిర్మాణం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఉగాది నాటికి నిర్దేశిత లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని, నిర్మాణం పూర్తయిన ఇళ్లకు విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్, గ్రామీణనీటిసరఫరా, పంచాయతీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల లక్ష్యాలను వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం సమీక్షించారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన పథకం కింద జిల్లాకు కొత్తగా ఇళ్లు మంజూరయ్యాయని, వాటికి రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలన్నారు. నిధులు సమృద్ధిగా ఉన్నా బిల్లులు అప్‌లోడ్ చేయడంలేదని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరును తనిఖీ చేయాలని ఆదేశించారు. జేసీ ఒ.ఆనంద్ మాట్లాడుతూ మార్కెట్ గోదాములు, వీఎల్‌సీపీ సెంటర్లు, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్మాణాలకు కావలసిన స్థలసేకరణ పూర్తిచేయాలన్నారు. మిల్లుల వద్ద దింపిన ధాన్యం బిల్లులను 24 గంటల్లోగా జనరేట్ చేయాలన్నారు. లేదంటే మండల ప్రత్యేక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మ్యూటేషన్లు, కరెక్షన్లను సకాలంలో పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

అర్హులందరికీ బ్యాంకు ఖాతాలు

జిల్లాలో అర్హులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. అభ్యుదయ (యాస్పిరేషనల్) జిల్లాల్లో అభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాలపై సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలకు బ్యాంకు ఖాతా తప్పనిసరని పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జేఎల్ఎస్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అభ్యుదయ జిల్లాల్లో పార్వతీపురం మన్యం జిల్లాను చేర్చిందన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి 18–50 సంవత్సరాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి 18–70 సంవత్సరాల వయస్సు ఉన్న వాళ్లు అర్హులని పేర్కొన్నారు. సమావేశాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డీవీ రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎం.వి.జి.కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రఘురాం, డీపీఓ సంత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ప్రకృతి సోయగం



సాయంసంధ్యా సమయాన... భానుడి కిరణ కాంతులు కొత్త రంగులను వెదజల్లాయి. ఆ ప్రాంతాన్ని రంగులమయం చేశాయి. విజయనగరం గాజులరేగ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కాసేపు కనిపించిన ఈ ప్రకృతి సోయగం చూపరులకు ఆహ్లాదాన్ని, కొత్త అనుభూతిని పంచింది.

– డి.సత్యనారాయణమూర్తి, సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

క్లుప్తంగా

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో ఉన్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తీపి పదార్థాలను నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కిశోర్ కుమార్ పర్యవేక్షించారు.

మృతుని కుటుంబానికి రూ.5లక్షలు మంజూరు



మంజూరు ఉత్తర్వులు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: విద్యుత్‌షాక్‌తో 2019 అక్టోబర్ 15న మృతిచెందిన పక్కి గ్రామానికి చెందిన శంబంగి సీతంనాయుడు కుటుంబసభ్యులకు విద్యుత్‌శాఖ రూ.5లక్షల సహాయం మంజూరుచేసింది. ఈ మేరకు మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మంజూరు ఉత్తర్వు కాపీని మంగళవారం గ్రామంలో అందించారు. విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సీతంనాయుడు కుటుంబాన్ని విద్యుత్‌శాఖ ఆదుకోవడంపై ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే డబ్బులు అందిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

8 వరికుప్పలు దగ్ధం

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో ఏడుగురు రైతులుకు చెందిన 8 వరికుప్పలు మంగళవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు కళ్లంలో రైతులు మోపాడ అచ్చిబాబు, కెల్లగౌరి, సారిక త్రినాథ్, తాళ్లపూడి అప్పలనాయుడు, తాళ్లపూడి అప్పారావు, పాలూరి వెంకటఅప్పారావు, కలిశెట్టి సీతం నాయుడులకు చెందిన 8 వరికుప్పలు పెట్టగా పూర్తిగా ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా. సమాచారం మేరకు గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆదుపు చేశారు. అప్పటికే పూర్తిగా వరి కుప్పలు కాలిపోయాయి.

యువకుడిపై అట్రాసిటి కేసు

గంట్యాడ: నువ్వంటే ఇష్టం. నువ్వు లేకపోతే బతకలేనని సినిమా డైలాగులు చెప్పేసరికి ఆ యువతి నమ్మేసింది. తీరా పెళ్లి చేసుకోమని అడిగేసరికి ప్రేమికుడి అసలు రంగు బయట పడింది. దీంతో ఆ యువతి తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రేమికుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన ఓయువతిని ప్రేమిస్తున్నానంటూ నరవ గ్రామానికి చెందిన యువకుడు సుంకరి శేఖర్ 10 నెలలుగా నమ్మిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని ఆయువతి కోరడంతో నీవు ఎస్సీ కులస్తురాలవి కాబట్టి పెళ్లి చేసుకోలేనని ప్లేట్ ఫిరాయించాడు. దీంతో ఆ యువతి పోలీసుకులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు శేఖర్‌పై అట్రాసిటి కేసు నమోదు చేసినట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కోరారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2023 జనవరి 23తో 10 సంవత్సరాల కాలపరిమితి ముగుస్తున్నందున ఈ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జనవరి 12న వైజాగ్‌లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు, యూనియన్ శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ పి.సత్యవతి, డొమెస్టిక్ వర్కర్స్ ఫోరం ఇండియా కో ఆర్డినేటర్ కె వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ మెంబర్ కొత్తపల్లి స్వప్న, సురగాల యమున, కింతాడ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



గోర్జ తిరుపతమ్మ మృతదేహం



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మడక సత్యవతి

ఉసురు తీసిన ఉపాధి యంత్రం



పోల లక్ష్మమ్మ మృతదేహం



గాయపడిన గేదెల శ్రీదేవి

- వరినూర్పిడి యంత్ర వాహనం బోల్తా పడి..
- ఇద్దరు మహిళాకూలీల మృతి
- మరో ఇద్దరికి గాయాలు

బొబ్బిలి రూరల్: కూలి ఆడితే గానీ కుండాడని మహిళా కూలీలు పనికోసం వెళ్తూ తిరిగిరాని లోకాలకు పయనమయ్యారు. ఉపాధి కల్పించే యంత్ర వాహనమే వారి పాలిట మృత్యు శకటమైంది. పని కోసం వెళ్లిన తమ వారు తిరిగి సాయంత్రం ఇంటికి వస్తారని ఎదురు చూస్తున్న కుటుంబసభ్యులకు వారి మరణ వార్త అందడంతో కంటికీ మింటికీ ఏకధారగా రోదించారు. ప్రతిరోజూ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే వ్యవసాయ మహిళా కూలీలు ఇద్దరు వరి నూర్పిడి యంత్రంపై పడి మంగళవారం ప్రాణాలు కోల్పోయారు. మండలంలోని గొంగాడవలస పంచాయతీ పరిధి అన్నంనాయుడు వలసలో ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందడంతో వారి కుటుంబాలతో పాటు గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ సంఘటనపై ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నంనాయుడు వలస గ్రామానికి చెందిన గోర్జ తిరుపతమ్మ (50), పోల లక్ష్మమ్మ(48), మడక సత్యవతి, గేదెల శ్రీదేవిలు రోజూలాగానే వ్యవసాయపనుల కోసం తమ గ్రామానికే చెందిన చొక్కాపు చంద్ర వరినూర్పిడి యంత్రం వాహనంపై కూర్చుని బయల్దేరారు. గ్రామానికి కొంతదూరంలో గల పొలంలోకి వెళ్తున్న వాహనం ఓ పుట్టను తప్పించబోయి బోల్తాపడింది. వాహనంపై కూర్చుని ప్రయాణిస్తున్న గోర్జ తిరుపతమ్మ యంత్రంపై పడి అక్కడికక్కడే మృతిచెందగా, పోల లక్ష్మమ్మ కొనఊపిరితో కొట్టుమిట్టాడి అరగంట అనంతరం మృతిచెందింది. మృతురాలు గోర్జ తిరుపతమ్మకు ఇద్దరుకుమార్తెలు చంద్రకళ, చిన్నతల్లి, కుమారుడు రవికుమార్ ఉన్నారు. 2022 మేనెలలో ఆమె భర్త అన్నంనాయుడు మృతిచెందాడు. పోలలక్ష్మమ్మకు భర్త శ్రీరాములు, కుమారుడు జనార్దనరావు, కుమార్తె భవాని ఉన్నారు.

విశాఖ కేజీహెచ్‌కు క్షతగాత్రుల తరలింపు

వాహనంపైనే ఉన్న మరో ఇద్దరు మడక సత్యవతి, గేదెల శ్రీదేవిలు తీవ్రంగా గాయపడడంతో వారిని 108అంబులెన్స్‌లో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం మేరకు బొబ్బిలి సీఐ ఎం. నాగేశ్వరరావు ఘటనాస్థలిని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా 'శంబరం' నిర్వహిద్దాం

- ఆర్డీవో హేమలత, డీఎస్పీ సుభాష్



జాతరపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో హేమలత



సమావేశానికి హాజరైన అధికారులు

మక్కువ: విజయనగరం అంటే గుర్తుకువచ్చేది పైడితల్లి అమ్మవారి పండగ. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా అంటే శంబరపోలమాంబ అమ్మవారి పండగ అని గుర్తుకు వచ్చేలా మనమంతా బాధ్యత తీసుకుని అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించుకుందామని ఆర్డీవో హేమలత కోరారు. ఈ మేరకు మండలంలోని శంబర గ్రామంలో చదురుగుడి వెనుకన క్యూ ప్రదేశం వద్ద జాతర నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో హేమలత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, పోలీస్‌శాఖ, దేవాదాయశాఖ, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు జాతరలో ఏర్పాట్లు చేయాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో సాలూరు సీఐ ధనుంజయ రావు మాట్లాడుతూ జాతరలో బందోబస్తు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందికి వసతి సౌకర్యాన్ని దేవాదాయ, పంచాయతీ శాఖల అధికారులు కల్పించాలన్నారు. అలాగే జాతరలో ఏయే శాఖల అధికారులు విధులు నిర్వహించనున్నారో వారి వివరాలు పోలీస్ శాఖకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హేమలతను కోరారు. జాతరలో ఏదైనా సమస్య వస్తే, వెంటనే ఆయాశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్య పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

జాతరలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆర్డీవో హేమలత మాట్లాడుతూ బుధవారం ఉదయం 10గంటల కల్లా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వివరాలను ఆయాశాఖల అధికారులు అందించాలని ఆదేశించారు. జాతరలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాలను గుర్తించి, వెంటనే వివరాలు అందించాలని సూచించారు. అలాగే దర్శనం టికెట్లు, ప్రసాదం కౌంటర్ ప్రదేశాల వివరాలు అందించాలని ఈవో రాధాకృష్ణను కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులు భక్తులు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. 104,108 వాహనాలతో పాటు, ఏఎల్‌ఓ స్ప్రే అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు సూచించారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి

శంబర, చెముడు గ్రామాల మధ్యనున్న గోముఖి నదిపై నుంచి వేలాదిమంది భక్తులు రాకపోకలు సాగించనున్నందున, ఆప్రదేశంలో విద్యుత్ లైట్లు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి సుధారాణి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపీడీవో దేవకుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, కమిటీసభ్యులు, ఎస్సై జి.పైడిరాజు, దేవాదాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

- జిల్లా సమగ్ర శిక్ష ఏపీడీ డాక్టర్ వి.అప్పలస్వామినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వి.అప్పలస్వామినాయుడు

తెర్లాం: మనబడి నాడు-నేడు పథకం కింద ఫేజ్-2లో మంజూరైన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వి.అప్పలస్వామినాయుడు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన ఫేజ్-2 నాడు-నేడు పనులపై పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏయే పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు పథకం కింద పనులు మంజూరు చేసిందో ఆ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపులో ఎటువంటి ఇబ్బందిలేదని, పనుల్లో జాప్యం జరిగితే సహించేదిలేదన్నారు. సమగ్ర శిక్ష ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

- ఉప కలెక్టర్ వెంకటేశ్వరరావు



రీసర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటేశ్వరరావు

గజపతినగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రత్యేక ఉపకలెక్టర్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని గుడివాడ గ్రామంలో చేపడుతున్న భూసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భూముల రీసర్వే చేపట్టడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. రెవెన్యూ సిబ్బందితో పాటు, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

బస్సు యాత్రను జయప్రదం చేయండి



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థిసంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు..ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం చేపడుతున్న యువజన విద్యార్థి సంఘాల బస్సు యాత్ర (జనవరి 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం టు ఇచ్ఛాపురం)ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్రప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణ్, తెలుగు యువత విజయనగరం జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు వేమలి చైతన్య బాబు, సీఐటీయూ నాయకుడు రమణ, సీపీఐ జిల్లాల్ కార్యదర్శి ఒమ్మి రమణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ తదితరులు ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రామకృష్ణ, వెంకటేష్, సతీష్, హర్ష, రవి, మణికంఠ, జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ భూమిలో సర్వే

- భూ ఆక్రమణలపై అప్రమత్తమైన రెవెన్యూ శాఖ



రియల్ ఎస్టేట్ భూమిలో రోవర్ ద్వారా సర్వే చేస్తూ సరిహద్దులు గుర్తిస్తున్న సర్వే అధికారులు

వీరఘట్టం: వీరఘట్టం శివారులో వేసిన రియల్ ఎస్టేట్ భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు రెవెన్యూశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. 'వీరఘట్టంలో రియల్ దందా' శీర్షికన సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనంతో ఆ భూమిలో రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా సర్వే చేస్తున్నారు. సబ్ డివిజన్ల వారీగా ప్రతి సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమి, డీ-పట్టా భూమి, బంజరు భూములను గుర్తించినట్లు తహసీల్దార్ జల్లేపల్లి మాధవి తెలిపారు.పూర్తి వివరాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ స్థలం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భూమిని కూడా గుర్తిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

కారు, ఆటో ఢీ: పలువురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న స్థానికులు

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని గుమ్మగదబవలస గ్రామ సమీప మలుపు వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న సంఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కురుపాం ఎస్సై సీహెచ్.ప్రసాద్ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. వంజరాపుగూడ నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న ఆటో, గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు బి.వైకుంఠరావు, పత్తిక చంద్రమోహన్, నిమ్మక మాధవరావు, పత్తిక విజయవర్ధన్‌ల కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి, దీంతో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న చీమల చిరంజీవి కాలు నుజ్జునుజ్జు కాగా, వంజరాపు నాని, వెంకటరమణ, ఆటో డ్రైవర్ పల్ల ఆదర్శ్ గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి క్షతగాత్రులను పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్, స్కూటీ ఢీకొని మరో వ్యక్తి..

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామానికి చెందిన కోరాడ సింహచలం గ్రామం నుంచి అలమండ సంతకు సైకిల్‌పై వెళ్తున్న సమయంలో కొత్తవలస నుంచి అలమండ సంతవైపు స్కూటీపై వస్తున్న వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాల పాలైన అతనిని 108 వాహనం ద్వారా విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జామి ఎస్సై వీరబాబు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించాలి

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించాలని సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో సీసీసీడీసీ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆంగ్లంలో భావ వ్యక్తీకరణ చేయగల స్థాయిలో ఉండాలని పిలుపునిచ్చారు. రెండు వారాల పాటు జరిగే శిక్షణ అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని ఆ లోగా లోపాలను సరిదిద్దుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, ప్రొఫెసర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

బొబ్బిలి: నాటు తుపాకీతో సంచరిస్తున్న వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ మంగళవారం తీర్పునిచ్చారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మజ్జి జగన్నాథం విలేకరులకు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం చెక్కవలస కూడలిలో ఒడిశాలోని నారాయణ పట్నానికి చెందిన కొర్రా త్రినాథ 2015 ఏప్రిల్13న నాటు తుపాకీతో సంచరిస్తుండడంతో పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి వాసుదేవన్ నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.మూడు వేల జరిమానా విధించారని ఏపీపీ వివరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నట్లు చెప్పారు.

దాడికేసులో ముద్దాయికి..

రాజాం సిటీ: రాజాం సబ్‌జడ్జి పరిధి పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో 2018లో నమోదైన దాడి కేసులో ముద్దాయికి .జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం అవలంగి గ్రామానికి చెందిన మజ్జి బంగారునాయుడిపై అదే గ్రామానికి చెందిన లోలుగు రాములునాయుడు కత్తితో దాడి చేసి గాయపర్చడంతో పాలకొండ స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. కేసు తుది విచారణ అనంతరం ముద్దాయి నేరం చేసినట్లు రుజువు కావడంతో సదరు వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారని పోలీసులు తెలిపారు. అయితే ముద్దాయికి 85 సంవత్సరాల వయస్సు కావడంతో పాటు వినికిడి, తదితర లోపాలు ఉన్నాయి. ఈ కారణంగా రూ.5వేలు వ్యక్తిగత బాండ్‌పై ఎగ్జిక్యూట్ చేస్తూ జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆరు నెలల పరిశీలన అనంతరం పూర్తి నివేదిక సమర్పించాలని జడ్జి తీర్పునిచ్చినట్లు పోలీసులు వివరించారు. ఈ కేసును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉషాకిరణ్ వాదించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

టీడీపీలో క్రమశిక్షణ ఏదీ?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

- అశోక్ చర్యలతో భ్రష్టుపడుతున్న పార్టీ
- పార్టీ బొండపల్లి మండల నాయకుల ఆవేదన

బొండపల్లి: జిల్లాలో తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో అభిమానం ఉన్నా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు చర్యల వల్ల పార్టీ భ్రష్టుపడుతోందని ఆ పార్టీ మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీతో పాటు టీడీపీ బొండపల్లి మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ పలువురు పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ గల పార్టీ అని చెప్పుకోవడమే కానీ పార్టీలో క్రమశిక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన గెద్ద కనకరాజుతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు కంది సూర్యనారాయణలు టీడీపీలో కొనసాగుతున్న వారే అయినా అశోక్‌గజపతిరాజు సమక్షంలో వేరే పార్టీ నుంచి చేరినట్లుగా పత్రికల్లో రావడం హాస్యాస్పదంగా ఉందని, ఖండిస్తున్నామన్నారు. పార్టీలో ఉన్నవారిని సమావేశం ఉందని చెప్పి తీసుకువెళ్లి పార్టీలో చేరినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

నియోజకవర్గంలో గ్రూపులను చక్కదిద్దే చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, అశోక్‌లకు తెలియచేసినా ఫలితం కనిపించ లేదని ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలోని నాయకులందరం ముకుమ్మడి రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో బీసీలను పార్టీలో అణగదొక్కే ప్రయత్నాలను జిల్లా పెద్దలు చేస్తున్నారని పార్టీలో బీసీలకు గౌరవం ఎక్కడిదని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు శనపతి శ్రీనివాసరావు, కొండపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భూహక్కు పత్రాల పంపిణీ



గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: రీ సర్వే పూర్తయిన ప్రాంతాల్లో సాంకేతిక ప్రక్రియలను పూర్తిచేసి రైతులకు భూహక్కు పత్రాలను త్వరితగతిన పంపిణీ చేయాలని తహసీల్దార్లను జేసీ కె.మయూర్‌అశోక్ ఆదేశించారు. ఖాతా నంబర్, ఎల్‌పీఎం నంబర్లలో తప్పులుంటే తప్ప భూహక్కు పత్రాల పంపిణీని ఆపొద్దన్నారు. రీసర్వే, భూహక్కు పత్రాల పంపిణీపై గుగూల్‌మీట్‌లో మంగళవారం సమీక్షించారు. మండలాల వారీగా నివేదికలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. మ్యుటేషన్ రిక్వెస్టులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్లకు వచ్చిన భూహక్కు పత్రాలను పంపిణీకి ముందే ఆర్డీఓలు పరిశీలించాలని, తప్పులేమైనా ఉంటే సవరణకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి ఆర్డీఓలు సూర్యకళ, అప్పారావు, శేషశైలజ, అన్ని మండలాల తహశీల్దార్లు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.